

మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటే.. నవ్యాంధ్రలో స్వర్ణయుగం సాకారం అవుతుంది.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. రాష్ట్రంలో పలుమార్లు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 2లక్షల పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీదే.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 26.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 156 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00




# వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్

**దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి**

**పెట్టుబడిదారులను దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తాం**

**స్పీడ్.. స్టెబిలిటీ.. సర్వీస్ మా ప్రత్యేకతలు**

**గుజరాత్-ఏపీ కలిసి పనిచేస్తే అద్భుతాలు**

**గుజరాత్ పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేష్ పిలుపు**



**అహ్మదాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** వికసిత్ భారత్ నిర్మాణంలో ఏపీ మెయిన్ గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని కోరుకుంటోందని, ఇందుకు పెట్టుబడిదారులు మద్దతుగా నిలవాలని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఏపీఈడీబీ ఆధ్వర్యంలో అహ్మదాబాద్ లో జరిగిన సీఐఐ(కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అహ్మదాబాద్‌కు రావడం ఎంతో ఆనందంగా ఉంది. దేశ ఆర్థిక ప్రగతిలో గుజరాత్ కు ప్రత్యేకస్థానం ఉంది. పారిశ్రామికవేత్తల స్ఫూర్తి, మౌలిక సదుపాయాలు, విధానాలు, వాటి అమలుతో ఎలాంటి ఫలితాలు సాధించవచ్చో గుజరాత్ నిరూపించింది. ప్రధాని నరేంద్ర మోదీ గారు గుజరాత్ అభివృద్ధి ప్రయాణాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. దేశానికి గొప్ప ప్రధానిని అందించిన గుజరాత్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వైబ్రంట్ గుజరాత్ మోడల్ పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ఒక ప్రధాన వేదికగా ఎదిగింది. 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించాలని ప్రధాని లక్ష్యంగా పెట్టుకున్నారు. వికసిత్ భారత్ ప్రయాణంలో ఏపీ కూడా ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని కోరుకుంటోంది. అందుకే ఈ రోజు ఇక్కడికి వచ్చాను. అభివృద్ధి దిశగా ఏపీ శరవేగంగా దూసుకెళ్తోంది. ఈ ప్రయాణంలో గుజరాత్ పారిశ్రామిక రంగం భాగస్వామి కావాలని మేం కోరుకుంటున్నాం.

**దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయి :** ఏపీ అభివృద్ధి విషయంలో మాకో స్పష్టమైన లక్ష్యం ఉంది. అత్యుత్తమ పెట్టుబడులు, సాంకేతికతలు, కంపెనీలను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అవి కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా గ్రౌండింగ్ అయ్యేలా చూస్తున్నాం. సీఎం చంద్రబాబు దార్శనిక నేత. ముందుచూపుతో ఆలోచించి, నిర్ణయాలు వేగంగా అమలు చేయాలని ఎప్పుడూ విశ్వసిస్తారు. అదే ఆలోచనా విధానం మా పెట్టుబడుల వ్యూహానికి మార్గదర్శకంగా ఉంది. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు. చంద్రబాబు గారి కేబినెట్ లో నేను సీనియర్ మంత్రిని. ఇది నా రెండో టర్మ్. అభివృద్ధి విషయంలో మా అందరిలో కసి ఉంది. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఏపీ ప్రత్యేకత. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లోనే దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయి. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. ప్రైవేట్ రంగాన్ని మించి ప్రభుత్వం కూడా వేగంగా పనిచేయగలదని మేం నమ్ముతున్నాం. ఇక్కడ వేదికపై ఉన్న పారిశ్రామికవేత్తలు తమ కంపెనీలను ఎలా అభివృద్ధి చేశారో చూస్తే నిజంగా అద్భుతంగా ఉంది. మిగతా 2లో...

## ఏపీలో ఫార్మాకు భారీ అవకాశాలు



- ఫార్మా రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టండి
- నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌లో పెట్టుబడులకు లోకేష్ ఆహ్వానం
- క్లస్టర్ మోడల్‌తో పారిశ్రామిక అభివృద్ధి

**అహ్మదాబాద్ (జర్నలిస్ట్ ఫైల్):** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026 – ఏపీ ఈడీబీ ఆధ్వర్యంలో ఫార్మా రంగంపై అహ్మదాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రజాప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ గురించి మంత్రి వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఫార్మాస్యూటికల్ తయారీ, ఔషధ ఎగుమతులు, ఆర్ అండ్ డీ, మౌలిక వసతులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ భారత ఫార్మా రంగ మిగతా 2లో...

## క్లీన్ ఎనర్జీకి ఏపీనే ఎంచుకోండి

- టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతాతో మంత్రి లోకేష్ భేటీ
- సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు అవకాశాలు పరిశీలించండి
- పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు ఆహ్వానం



**అహ్మదాబాద్ (గుజరాత్)(జర్నలిస్ట్ ఫైల్):** ఫార్మాస్యూటికల్స్, పవర్, గ్యాస్, ఎలక్ట్రికల్ రంగాల్లో పేరెన్నికగన్న టోరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, డైరక్టర్ షాన్ మెహతా, హోల్ టైమ్ డైరక్టర్ జిగీష్ మెహతాలతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అహ్మదాబాద్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ కోసం టోరెంట్ వైజాగ్ ప్లాంట్ ఏపీఐలు, అధునాతన ఇంటర్మీడియట్‌లపై దృష్టి సారించిన నేపథ్యంలో, మిగతా 2లో...

## కాకినాడకు పరిశ్రమల కళ



- వెల్‌స్పన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మంత్రి లోకేష్ పిలుపు
- విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌కు ఆహ్వానం
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్న వెల్‌స్పన్ సీఈఓ

2 లో

## విశాఖలో టైర్ల తయారీకి రెడీ అవ్వండి



- చిరిపాల్ గ్రూప్ ఎండీ బ్రిజ్ మోహన్‌తో మంత్రి లోకేష్ భేటీ
- గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం ఆహ్వానం
- విశాఖలో మౌలిక వసతులు, కనెక్టివిటీ అనుకూలతలను వివరించిన లోకేష్

**అహ్మదాబాద్ (గుజరాత్)(జర్నలిస్ట్ ఫైల్):** టెక్స్ టైల్, ప్యాకేజింగ్ ఫిల్మ్, సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, కెమికల్స్ రంగాల్లో పేరెన్నికగన్న చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్, గ్రూప్ అనుబంధ సంస్థ గ్రూ సోలార్ సిఇఓ వినయ్ థదానితో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అహ్మదాబాద్ లో సమావేశ మయ్యారు. మిగతా 2లో...

## డేటా సెంటర్లకు.. ప్రీ-ఫ్యాబ్ కేంద్రం



- విశాఖలో ఏర్పాటు చేయాలని ఈప్యాక్ గ్రూప్‌కు లోకేష్ సూచన
- ఈప్యాక్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో మంత్రి భేటీ
- శ్రీసిటీ, మాంబట్టులో ఇప్పటికే ఈప్యాక్ తయారీ కేంద్రాలు

**అహ్మదాబాద్ (గుజరాత్)(జర్నలిస్ట్ ఫైల్):** బులియన్ ట్రేడింగ్, ప్రీసియస్ మెటల్స్, కమాడిటీస్, డ్యూరబుల్స్ తయారీలో పేరెన్నికగన్న ఈ ప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అహ్మదాబాద్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ డేటా సెంటర్ హబ్‌గా మారుతున్న మిగతా 2లో...

## నక్కపల్లి.. బయోఫార్మా కేంద్రం



- బయోసిమిలర్ ప్లాంట్‌కు ఎంక్యూర్‌కు మంత్రి లోకేష్ పిలుపు
- బల్క్ డ్రగ్ పార్క్‌లో విస్తరణ అవకాశాలను పరిశీలించాలని సూచన
- కాంప్లెక్స్ ఇంజెక్టబుల్స్, బయోసిమిలర్స్‌పై ఎంక్యూర్ దృష్టి

2 లో

**అహ్మదాబాద్ (గుజరాత్)(జర్నలిస్ట్ ఫైల్):** ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ గ్లోబల్ ప్రెసిడెంట్ (టెక్నికల్ ఆపరేషన్స్) దీపక్ గోండాలియాతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అహ్మదాబాద్ లో భేటీ అయ్యారు.

## విశాఖ.. డేటా సెంటర్ల హబ్



- పెట్టుబడులకు ఎస్‌టీ టెలీమీడియాకు మంత్రి లోకేష్ ఆహ్వానం
- గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఇప్పటికే ముందడుగు
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్న సంస్థ ప్రతినిధులు

2 లో

## నెల్లూరులో రిఫైనరీలకు రెడీ

- గోకుల్ ఆగ్రో రిసోర్సెస్‌తో మంత్రి లోకేష్ చర్చలు
- పామాయిల్, సోయాబీన్ ఆయిల్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదన
- ఏపీలో విస్తరణ అవకాశాలపై సంస్థ పరిశీలన

2 లో

**అహ్మదాబాద్ (గుజరాత్)(జర్నలిస్ట్ ఫైల్):** ఎడిబుల్ ఆయిల్స్, ఒలియో కెమికల్స్, బయో డీజిల్ రంగాల్లో ప్రఖ్యాతిగాంచిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ లిమిటెడ్ చైర్మన్ & మేనేజింగ్ డైరక్టర్ కనుభాయ్ జె.ఠక్కర్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అహ్మదాబాద్‌లో సమావేశమయ్యారు.



## పైపుల తయారీకి ఏపీ.. రండి

- ఆస్ట్రల్ పైప్స్‌కు మంత్రి లోకేష్ ఆహ్వానం
- వేగవంతమైన అనుమతులు, ప్రత్యేక ప్రోత్సాహకాలపై హామీ
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్న సంస్థ ప్రతినిధి

2 లో

**అహ్మదాబాద్ (గుజరాత్)(జర్నలిస్ట్ ఫైల్):** పైపులు, వాటర్ ట్యాంకులు, పెయింట్లు, నిర్మాణ రసాయనాల తయారీలో పేరుపొందిన ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ ఎఫైర్స్) అల్కేష్ పంచల్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అహ్మదాబాద్‌లో



## టెక్నాలజీతో ఏపీ టూరిజంలో కొత్త శకం

- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం,(జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతున్నామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సెప్టెంబరు 27న రాజమహేంద్రవరంలోని మంజీరా కన్వెన్షన్ హాల్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వేడుకలు జరగనున్నాయని, పర్యాటక రంగ నిపుణులు, టూర్ ఆపరేటర్లు, కంటెంట్ క్రియేటర్లు, టెక్నాలజీ నిపుణులు పాల్గొంటారని తెలిపారు.
ఏపీ టూరిజం, ఎక్స్‌ప్లర్జర్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 130కిపైగా పర్యాటక ప్రాంతాల్లో 'నివ' ఏఐ ఆధారిత క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. ఒకసారి స్కాన్ చేస్తే 130కిపైగా భాషల్లో పర్యాటక సమాచారాన్ని అందించే డిజిటల్ గైడ్‌తో మాట్లాడవచ్చున్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని 'ది గోదావరి కాల్స్' ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 26న విశాఖ నుంచి రాజమహేంద్రవరానికి హాప్-ఆన్ హాప్-ఆఫ్ బస్సుల్లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లతో ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 27న సాంస్కృతిక కార్యక్రమాలు, ఏపీ టూరిజం అవార్డ్స్-2026 ప్రదానోత్సవం, పుస్తక ఆవిష్కరణ, లైవ్ మ్యూజికల్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## యువత భవితకు భరోసా.. నైపుణ్యాలతోనే భవిష్యత్ ఉద్యోగాలు



- కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గం చోడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి పెమ్మసాని మాట్లాడుతూ దేశంలో, ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతలు భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం చూపనున్నాయని పెమ్మసాని తెలిపారు. గతంలో ఇంజినీరింగ్ డిగ్రీ ఉంటే ఉద్యోగం పొందే అవకాశాలు ఉండేవని, రాబోయే రోజుల్లో డిగ్రీతో పాటు అదనపు నైపుణ్యాలు తప్పనిసరిగా అవసరమవుతాయని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, రోబోటిక్స్ వంటి రంగాల్లో ఏదో ఒక అంశాన్ని ఎంచుకుని దానిపై లోతైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం రెండు గంటలు సాధన చేస్తే ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించవచ్చున్నారు. ఏఐ పట్ల భయపడకుండా దానిని అవకాశంగా మలుచుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానంతో చిన్న బృందాలతోనే వ్యాపారాలను ప్రారంభించే అవకాశాలు పెరిగాయని తెలిపారు. యూట్యూబ్ వంటి డిజిటల్ వేదికల్లో అందుబాటులో ఉన్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగం చేయాల్సిన విధంగా ఇప్పటి నుంచే కష్టపడి పనిచేస్తే ఉద్యోగం అవసరమైన సమయంలో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని పెమ్మసాని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకున్నట్లే ప్రభుత్వం కూడా యువత భవిష్యత్తుపై బాధ్యతతో పనిచేస్తోందన్నారు. సోషల్ మీడియాలో విద్యార్థులను తప్పుదోవ పట్టించే సమాచారం వస్తోందని, వాటిని గుడ్డిగా నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాలపై వచ్చిన విమర్శలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసిందన్నారు. డీఎస్సీ నియామకాల్లో ఏవైనా తప్పులు జరిగాయని భావిస్తే ఆధారాలతో బహిరంగ చర్చకు రావాలని, తప్పులు ఉన్నట్లు తేలితే సరిదిద్దే బాధ్యత తీసుకుంటామని తెలిపారు.
సమాజానికి, విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేసే నాయకత్వాన్ని ప్రజలు వాస్తవాలను పరిశీలించి అంచనా వేసుకోవాలని పెమ్మసాని సూచించారు. ఎవరో చెప్పిన సమాచారాన్ని ఆధారంగా చేసుకోకుండా ప్రతి అంశాన్ని స్వయంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఒక కళాశాలను నిర్వహించడం కత్తిమీద సాము వంటిదని, విద్యా వ్యవస్థను విజయవంతంగా నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. యువత, మహిళల అభ్యున్నతితో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఒకే దఫాలో 16 వేలకుపైగా డీఎస్సీ పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగులకు అవకాశాలు కల్పించామని తెలిపారు. కష్టపడి చదువుకునే విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు రాయపాటి శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్లపాలెంలో ఎస్ ఐ రవీంద్ర స్పెషల్ డ్రైవ్

**కర్లపాలెం,(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రాణం ఎంతో విలువైనదని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ వాహనదారుడిపై ఉందని కర్లపాలెం ఎస్సై రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, రాబోయే ఎన్నికల నేపథ్యంలో కర్లపాలెం పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక కూడలిలో విస్తృత వాహన తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ రవీంద్ర మాట్లాడుతూ వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ఇది కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాకుండా ప్రాణాలను కాపాడుకోవడానికి అని ఎస్సై రవీంద్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.
నిబంధనలు పాటించని వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. హెల్మెట్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు భారీ జరిమానాలు విధిస్తూ హెచ్చరించారు. కర్లపాలెం మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్లను పోలీసులు తొలగించారు. దీంతో రహదారులు విశాలంగా మారడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.
రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న ఈ చర్యలకు ప్రజలు, వాహనదారులు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని ఎస్సై కోరారు.

# డిసెంబరు 10 నుంచి 'సంజీవని' ట్రయల్ రన్

- జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి అమలు
- ప్రతి వ్యక్తికీ ప్రత్యేక ఆరోగ్య ప్రొఫైల్
- ఇంటి వద్దకే 41 రకాల పరీక్షలు ఉచితం.. 48 గంటల్లో రిపోర్టులు
- ఆరోగ్య పరీక్షల నుంచి చికిత్స వరకు అనుసంధానం.. 'సంజీవని'తో సమగ్ర వైద్య సేవలు
- ధర్మవరశీలో 71 ఆరోగ్య రథాలు ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్




**ధర్మవరం,(జర్నలిస్ట్ ఫైల్):** ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను నమోదు చేసి, పరీక్షల నుంచి చికిత్స వరకు అవసరమైన వైద్య సేవలను అనుసంధానం చేసే సంజీవని కార్యక్రమానికి డిసెంబరు 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించి, జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లే లక్ష్యంతో ఆరోగ్య రథాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా శుక్రవారం ధర్మవరం నుంచి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన 71 ఆరోగ్య రథాలను మంత్రి ప్రారంభించారు.

**41 రకాల పరీక్షలు ఉచితం...**
ఆరోగ్య రథాల్లో 41 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. సాధారణంగా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చయ్యే పరీక్షలను కూడా ఉచితంగా అందిస్తామన్నారు. డయాబెటిస్, రక్త పరీక్షలు, కిడ్నీ, కాలేయం తదితర పరీక్షలు ఇందులో ఉంటాయని వివరించారు. పరీక్షలు పూర్తయిన 48 గంటల్లోపు రిపోర్టులను ఫోన్ వాట్సాప్‌కు పంపుతామని తెలిపారు. ఆరోగ్య సమస్య గుర్తిస్తే రిపోర్టు ఇచ్చి వదిలేయకుండా, అవసరమైన వైద్య సేవలు అందేలా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**గత వైద్య చరిత్ర డిజిటల్‌గా...**
వ్యక్తిగత వైద్య వివరాలను డిజిటల్‌గా నమోదు చేసే విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి తెలిపారు. గత పరీక్షల ఫలితాలు, రక్తపోటు, రక్తంలో చక్కెర, రక్త గ్రూపు, తీసుకున్న చికిత్స, వాడుతున్న మందులు వంటి వివరాలు నమోదు అవుతాయని చెప్పారు. దీంతో పాత నివేదికలన్నీ ప్రతిసారీ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. గత వైద్య చరిత్రను పరిశీలించి వైద్యులు తదుపరి చికిత్సను కొనసాగించవచ్చని తెలిపారు.

**'సంజీవని'లో ఆరోగ్య వివరాలన్నీ...**
వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ఒకే చోట నమోదు చేసేందుకు 'సంజీవని' డిజిటల్ వేదికను రూపొందిస్తున్నామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. పరీక్షల ఫలితాలు, వైద్యుడి సలహా, అపాయింట్‌మెంట్, మందుల వినియోగం, తదుపరి పరీక్షలు వంటి వివరాలను ఇందులో నమోదు చేస్తామన్నారు. ప్రతి వ్యక్తికి ఒక బయోడేటా ఉన్నట్టే.. ఇక ఆరోగ్య ప్రొఫైల్ కూడా ఉంటుంది అని మంత్రి అన్నారు. ఆరోగ్య సమస్యలు, గత చికిత్స, ప్రస్తుతం వాడుతున్న మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదుపరి వైద్య సేవల వివరాలు ఇందులో అందుబాటులో ఉంటాయని చెప్పారు.

**2 వేలకుపైగా ఆసుపత్రుల్లో సమన్వయకర్తలు**
రాష్ట్రవ్యాప్తంగా 2,000కుపైగా ఆసుపత్రుల్లో సమన్వయకర్తలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పరీక్షల ఫలితాలను పరిశీలించిన తర్వాత ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సమన్వయకర్తలు సంబంధిత వ్యక్తులను సంప్రదిస్తారని చెప్పారు. బీపీ, డయాబెటిస్ వంటి సమస్యలు ఉంటే ఏ ఆసుపత్రికి వెళ్లాలి, ఏ వైద్యుడిని కలవాలి, అపాయింట్‌మెంట్ ఎలా పొందాలి అనే వివరాలను అందిస్తారని తెలిపారు. చికిత్స తర్వాత మందులు సక్రమంగా వాడుతున్నారా, ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే విషయాలను కూడా తెలుసుకుంటారని చెప్పారు.

**రాష్ట్రంలో 933 ఆరోగ్య రథాలు :** రాష్ట్రవ్యాప్తంగా 933 ఆరోగ్య రథాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతపురం--శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన 71 రథాలను ధర్మవరం నుంచి ప్రారంభించామని చెప్పారు. ఇవి గ్రామాలకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తాయని, ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తాయని తెలిపారు. గతంలో 104 వాహనాలు, చంద్రన్న సంచార చికిత్స, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలు అమలయ్యాయని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు ఆరోగ్య పరీక్షలు, ఫలితాలు, తదుపరి వైద్యం, చికిత్స అనంతర పర్యవేక్షణను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు.

**కుప్పంలో ప్రారంభించి.. ధర్మవరం వరకు.:** ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. అనంతరం చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో అమలు చేశామని చెప్పారు. గిద్దలూరు, గన్నవరం ప్రాంతాల్లోనూ నిర్వహించామని, ఇప్పుడు ధర్మవరం నుంచి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. డిసెంబరు 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ట్రయల్ రన్ నిర్వహించి, జనవరి 1 నుంచి ఆరోగ్య రథాలను సంజీవనితో అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ పర్యవేక్షణలో భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పవన్ 108తో పాటు, 104 వైద్య సేవలను సమర్థంగా నిర్వహిస్తున్నారని చెప్పారు..

**అనారోగ్యంతో కుటుంబాలు నష్టపోకూడదు :** వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందుగానే గుర్తించి అవసరమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. అనారోగ్యం కారణంగా కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతినకుండా, పేదలకు అవసరమైన వైద్య సేవలు సులభంగా అందేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. రామాయణంలో ప్రాణాలను కాపాడిన 'సంజీవని' ఔషధం పేరుతో ఈ కార్యక్రమానికి ఆ పేరు పెట్టామని మంత్రి వివరించారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి రోజున కార్యక్రమాన్ని ప్రారంభించడం ప్రత్యేకమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు, నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రకాశరావు, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, అనంతపురం జిల్లా డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, సత్యసాయి జిల్లా డిఎంహెచ్వో ఫైరోజ్ బేగం, రాష్ట్ర వైద్య ఆరోగ్య అధికారులు విజయలక్ష్మి ఎస్పిఎం, ప్రకాష్ రావు సీఏఓ, ధర్మవరం ఆర్డిఓ రాంభూపాల్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఓలు భాగ్యలక్ష్మి, మంజువాణి, డిసిహెచ్ఎస్ శ్రీకాంతి, తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మూరులో ఎన్టీఆర్, అంబేద్కర్, కలాం విగ్రహాల ఆవిష్కరణ





**కొమ్మూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** కాకుమాను మండలం కొమ్మూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. అదే సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన బస్‌స్టాప్‌ను కూడా ప్రారంభించారు. కాకుమాను మండల టీడీపీ నాయకుడు అగస్టీన్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో రాజ్యసభ సభ్యుడు రాష్ట్రం రామకృష్ణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ వందనా దేవి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కొమ్మూరులో వినూత్న ఆలోచనతో విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విగ్రహాల కింద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం కొత్త కాన్సెప్ట్‌గా ఉందని పేర్కొన్నారు. ఆర్థిక వనరులు లేకపోయినా అగస్టీన్ బాబు సంకల్పంతో ముందుకు సాగి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలు కలిసి జీవిస్తున్న కొమ్మూరు గ్రామం గ్రామ స్వరాజ్యానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు.
గుంటూరు ఛానల్ భూసేకరణకు సంబంధించి మరో రూ.13 కోట్ల పరిహారం మాత్రమే పెండింగ్‌లో ఉందని పెమ్మసాని తెలిపారు. రూ. 350 కోట్లతో గుంటూరు ఛానల్ ఆధునికీకరణ పనులకు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో శంకుస్థాపన చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు గుంటూరులో సరస్ మేళా నిర్వహించామని, ఇప్పుడు విజయవాడలో 600 స్టాళ్లతో భారీ సరస్ మేళా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రూ. 4 వేల నుంచి సామాజిక పింఛన్లు అందిస్తున్నామని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికీ రూ. 200 నుంచి రూ. 300 వం-కు మాత్రమే పింఛన్లు ఉన్నాయని పెమ్మసాని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో డీడీయూ-జీకేవై పథకం కింద సుమారు 7,700 మందికి ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం దీర్ఘకాలం కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూడా యువత వచ్చే స్థాయిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు.
కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నక్కల శైలజ, టీడీపీ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, గింజపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు వీరయ్య చౌదరి, నియోజకవర్గ జనసేన కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మధుకర్‌కు పీవీఎన్ మాధవ్ శుభాకాంక్షలు



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** రెండు తెలుగు రాష్ట్రాలకు భారతీయ జనతా పార్టీ సంఘటనా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మధుకర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో కలిసి మధుకర్‌ను సత్కరించారు.
ఈ సందర్భంగా పార్టీ నేతలు మధుకర్‌కు అభినందనలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత బలోపేతానికి ఆయన సేవలు ఉపయోగపడతాయని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలపై బీజేపీ కార్యాచరణకు దిశానిర్దేశం



- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో పీవీఎన్ మాధవ్ సమావేశం

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే పార్టీ కార్యక్రమాలు, సంస్థాగత అంశాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని మాధవ్ సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రతి బూత్‌లో కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచుతూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## పౌష్టికహారం గూర్చి అవగాహన

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** అంతర్జాతీయ "పోషణ మాసం" లో భాగంగా పాండ్రపాడు సెక్టార్ పరిధిలోని లింగంగుంటపాలెం, వల్లూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం లో సెక్టార్ సూపర్ వైజర్ ప్రేమలత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.
సూపర్వైజర్ ప్రేమల మాట్లాడుతూ పోషకాహారం గురించి, అంగన్‌వాడీలో పెట్టే మధ్యాహ్న భోజనం గురించి వివరించారు.
గర్భిణులు, పిల్లల తల్లులు అంగన్‌వాడీ టీచర్స్‌ని, హెల్పర్స్‌ని ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

# దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు ప్రపంచానికి దిక్సూచి

- ఏకాత్మ మానవ దర్శనం, అంత్యోదయమే సమగ్ర అభివృద్ధికి మార్గం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవ దర్శనం, అంత్యోదయ సిద్ధాంతాలు నేటికీ సమాజానికి, ప్రభుత్వాలకు మార్గదర్శకంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడ లబ్బీపేటలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహం వద్ద శుక్రవారం ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రపంచం క్యాపిటలిజం, కమ్యూనిజం అనే రెండు సిద్ధాంతాల మధ్య విభజించబడిన సమయంలో భారతీయ చింతన ఆధారంగా ఏకాత్మ మానవ దర్శనాన్ని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని తెలిపారు. మనిషిని కేవలం ఆర్థిక జీవిగా కాకుండా శారీరక, మానసిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక అవసరాలతో కూడిన సంపూర్ణ వ్యక్తిగా చూడాలని ఆయన సూచించారని పేర్కొన్నారు.
మహాత్మాగాంధీ సర్వోదయ భావనకు విస్తృత రూపంగా అంత్యోదయ సిద్ధాంతాన్ని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ముందుకు తీసుకొచ్చారని మాధవ్ తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి ఫలాలు చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రజల సంతోషం, సంక్షేమమే ప్రభుత్వాల పనితీరుకు గీటురాయి కావాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, ఆధ్యాత్మిక విలువలపై కూడా దీన్‌దయాళ్ దూరదృష్టితో ఆలోచనలు చేశారని తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా బీజేపీ కార్యకర్తలు దీన్‌దయాళ్ జీవితాన్ని, సిద్ధాంతాలను అధ్యయనం చేసి సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలకు స్ఫూర్తిదాయకం దీన్‌దయాళ్ జీవితం**
బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లోనూ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం, సిద్ధాంతాలు ప్రతి బీజేపీ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పార్టీ సిద్ధాంతం, కార్యపద్ధతి, కార్యకర్త నడవడిక ఎలా ఉండాలో ఆయన తన ఆచరణ ద్వారా చూపించారని తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ అత్యంత నిరాడంబరంగా సాధారణ కార్యకర్తగా జీవించారని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల విషయంలో ఆయన చూపిన నిబద్ధత, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేసినప్పటికీ వ్యక్తిగత దూషణలకు తావివ్వని సంస్కారం నేటి కార్యకర్తలకు ఆదర్శమన్నారు.
ఏకాత్మ మానవ దర్శనం భారతీయ తత్వచింతనకు ప్రతిరూపమని, కుటుంబం నుంచి పాలన వరకు సమాజంలోని ప్రతి అంశంపై దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విలువైన మార్గదర్శకత్వం అందించారని మాధవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని, విజయవాడలో ఏకాత్మ మానవ దర్శనంపై జాతీయస్థాయి కార్యక్రమం నిర్వహించడం, ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం రాష్ట్ర బీజేపీకి గర్వకారణమన్నారు. ప్రతి కార్యకర్త దీన్‌దయాళ్ జీవితాన్ని, సిద్ధాంతాలను అధ్యయనం చేసి ఆచరణలో పెట్టాలని సూచించారు.
కార్యక్రమాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న, రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, నార్ని తాతాజీ, షేక్ బాజీ, లాకా వెంగళరావు యాదవ్, కరినాగలక్ష్మి, కోలపల్లి గణేష్, పిట్టల గోవిందు, చైతన్య శర్మ, నామిశెట్టి వెంకట్, తరుణ్ కాకాని, పైలా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మొండిగోడలకు డ్రా తీసి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అర్హులకు ఇవ్వాలి
- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించి లిక్కిబాలరాజు



కొత్తగూడెం సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తికాకుండానే గతప్రభుత్వం మాదిరి గానే మొండిగోడలకుడ్రా తీసి ప్రజలను మోసం చేస్తున్నారని సిపి ఎం టౌన్‌కార్యదర్శి లిక్కిబాలరాజు ఆరోపించారు. స్థానిక కొత్తగూడెంక్లబ్‌లో డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి గురువారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో 2023 మార్చిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లలబ్ధిదారులకు డ్రా తీశారని ఆనాడు ఇల్లు పూర్తి కాకుండా మొండిగోడలకు డ్రా తీసి ప్రజలను మోసంచేశారని, నేటికీ ఇల్లు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడుడ్రా తీసినప్పుడు ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే హడావుడిగా అధికారులు, స్థానిక కౌన్సిలర్లు కలిసి డ్రా తీసి ప్రజలను మోసం చేశారని, తిరిగి ఇప్పుడు కూడా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లనిర్మాణం పూర్తికాకుండానే అధికారులు హడావుడిగా డ్రా తీసి ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కేటాయించిన లబ్ధిదారులకు ఇల్లు చూపించాలని, ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సిపిఎం వినతికి స్పందించిన ఎమ్మెల్యే ఇళ్లనిర్మాణం పూర్తి చేశాకనే లబ్ధిదారులకు ఇస్తామని హామీ ఇచ్చారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం 36మంది ఒక బ్లాక్‌లో ఉండే విధంగానిర్మాణం చేపట్టారని, వారికి కేటాయించిన ఇళ్లనిర్మాణం ఎంత వరకు అయిందో చూసి మిగతా ఇంటి నిర్మాణం పూర్తి చేసిలబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీసభ్యులు భూక్యరమేష్, లక్ష్మీ, మందా నాగకృష్ణ, రాజేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ సమస్యలు రాకుండా నాణ్యమైన బొగ్గును అందించాలి

- బీఆర్ఎస్, టీబీజికెఎస్ నాయకత్వంలో ధర్నా




కొత్తగూడెంసింగరేణి సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కరెంటు సమస్యలు రాకుండా నాణ్యమైన బొగ్గు అందించాలని, సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు టీబీజికెఎస్ నాయకత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోనిసింగరేణి భవన్‌ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం డైరెక్టర్ ఆపరేషన్ కు మెమోరాండం సమర్పించారు. సింగరేణిసంస్థలో నిర్వహించే మెడికల్ బోర్డులను నెలకు మూడుసార్లు నిర్వహించి, 100శాతం అన్ఫిట్ చేయాలని, కార్మికులకు వైద్యపరమైన సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని, సింగరేణి సంస్థకు జెన్కో నుంచి రావాల్సిన 67వేల కోట్ల మొండి బకాయిలను వెంటనే వసూలుచేసి సంస్థకు చెల్లించాలని, గుర్తింపుకార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని వారి న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి పెంపు, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను సమన్వయం చేస్తూ ప్రధాన డిమాండ్లను యాజమాన్యం, సంబంధిత ప్రభుత్వం తక్షణమేసానుకూల నిర్ణయాలు తీసుకోవాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం, బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో కొప్పుల ఈశ్వర్, మిరియాల రాజిరెడ్డి, కాపు కృష్ణ, కూసన వీరభద్రం, గడప రాజయ్య, శ్రీనివాస రావు, కిరణ్‌కుమార్, మహేందర్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మా భూములు మాకు కావాలి

- ఎలాంటి పరిహారం వద్దు.. • అలాగే జీఓ 240 కూడా వద్దు..
- రైతుల పక్షాన గళమెత్తిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..



హైదరాబాద్, సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : మూసీ పరీవాహక అభివృద్ధి పథకంలో భాగంగా భూముల స్వాధీనానికి ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 240పై ఉప్పల్ నియోజకవర్గ రైతుల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రైతులతో కలిసి మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని కలిశారు. ఈ సందర్భంగా రైతులు "మా భూములు మాకు కావాలి.. ఎలాంటి పరిహారం వద్దు.. జీఓ 240 వద్దు" అంటూ తమ ఆందోళనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించిన ఎమ్మెల్యే, వారి భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోకుండా రైతుల ప్రయోజనా లను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మూసీ నదికి సుమారు కిలోమీటర్ పరిధిలోని భూముల స్వాధీనం అంశంపై రైతులకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. చిన్నచిన్న కమతాలు కలిగిన రైతులు, ఇప్పటికే నివాస ప్రాంతాలు ఏర్పడిన భూముల యజమానులు, ఖాళీ స్థలాలు కలిగిన రైతుల విషయంలో ప్రభుత్వం అనుసరించనున్న విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని కోరారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో
# నిందితుడి ఆస్తుల జప్తు : సిఐ



కొత్తగూడెం సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వం నిషేధించిన గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడి ఆస్తులను, అతని భార్య బ్యాంక్ ఖాతాను ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా జప్తు చేసినట్లు ఏడూళ్లబయ్యారం సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ ఏడూళ్లబయ్యారం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన సిఆర్.నెం.136/2025, యు/సెక్షన్ 8(సి)ఆర్/డబ్ల్యు 20(బి)(ıı)(సి), 27(ఏ), 29 ఆఫ్ ఎన్‌డిపిఎస్ యాక్ట్-1985కేసులో నిందితుడు పల్లపు రఘు అక్రమ గంజాయి రవాణా ద్వారా సంపాదించినట్లు గుర్తించిన ఆస్తులపై ఆర్థిక దర్యాప్తు చేపట్టారు. కారుడ్రైవర్‌గా ఉన్న రఘు స్వస్థలం మండేపల్లి గ్రామం చిన్నకోడూరు మండలం, సిద్దిపేట జిల్లా, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసంఉంటున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి పేరుతో ఉన్న రెండుకార్లు, ఒక మోటార్ సైకిల్, అతని భార్యకు సంబంధించిన ఖాతాను చెన్నైకాంపిటెంట్ అథారిటీ ద్వారా ఫ్రీజింగ్ ఆర్డర్ పొందిన అనంతరం, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జప్తు చేసినట్లు తెలిపారు.జప్తుచేసిన ఆస్తులు, బ్యాంక్ ఖాతా విలువ మొత్తం సుమారు రూ.21,15,907గా ఉన్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ కొనుగోలు,రవాణా వంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతోపాటు, నేరాల ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి జప్తుచేసేందుకు నిరంతరంచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకేసులో నిందితుడిని అరెస్టు చేయడమే కాకుండా నేరం ద్వారా సంపాదించిన ఆస్తులు గుర్తించి జప్తుచేసేలా సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టిన ఏడూళ్లబయ్యారం సిఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్ఐ, పోలీస్‌సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

# సేవాభావంతోనే సమాజ పురోగతి

: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ఫూర్తినింపిన 'ఎన్ఎస్ఎస్ ఫార్మేషన్ డే' వేడుకలు



గోదావరిఖని, సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : సామాజిక సేవే పరమార్థంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ముందుకు సాగినప్పుడే సమాజ పురోగతి సాధ్యమవుతుందని కరీంనగర్ 'మై భారత్ యువ కేంద్రం' యూత్ ఆఫీసర్ గోలి తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. గురువారం,గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా అధ్యక్షతన నిర్వహించిన 'ఎన్ఎస్ఎస్ ఫార్మేషన్ డే' వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జీవితంలో ఎదురయ్యే కష్టాలను అధిగమిస్తూ సాధించినప్పుడే నిజమైన విజయం లభిస్తుందని పేర్కొంటూ,అంగవైకల్యం సాధనకు ఆటంకం కాదని స్పష్టం చేశారు. 'మౌనంగానే ఎదగని మొక్క నీకు చెబుతుంది' పాట చిత్రీకరణలో తాను ఫ్లూట్ వాయించిన నాటి రోజులను,తన ఎదుగుదలకు లభించిన స్ఫూర్తిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గాంధీజీ, భగత్ సింగ్, జ్యోతిబా పూలేల అడుగుజాడల్లో నడుస్తూ దేశ సేవకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల పోలీస్ అకాడమీలో డిసాస్టర్ మేనేజ్మెంట్‌పై 'యువ ఆపద మిత్ర' శిక్షణ పూర్తి చేసుకున్న 13 మంది వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే కళాశాల పరిధిలోని మూడు ఎన్ఎస్ఎస్ యూనిట్ల కెప్టెన్లు, వైస్ కెప్టెన్లకు బ్యాడ్జీలు తొడిగి గౌరవించారు. ఈ వేడుకల్లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ. సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఎం.నరేష్, డా.డి.కిరణ్మయి, అధ్యాపకులు డా.జి.సుబ్బారావు, సవిత, సురేష్, శారదతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పాములేరు వంతెనను పరిశీలించిన పైడి, కోయ్యల, నరాటి

- ఫోన్‌లో అధికారులతో మాట్లాడిన మంత్రి తుమ్మల



ములకలపల్లి సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : మంత్రితుమ్మల నాగేశ్వరరావు ఆదేశంతో పాములేరు వంతెనను దమ్మపేట మాజీ జడ్పీటిసి పైడి వెంకటేశ్వరరావు, మార్కెట్‌కమిటీ చైర్మన్ కోయ్యల అచ్యుతరావు, సిపిఐ జిల్లానాయకులు నరాటిప్రసాద్‌లు గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ములకలపల్లి మండలం కంపగూడెం శివారులోని పాములేరు వాగుపై వంతెన కూలిపోయిన విషయం తెలుసుకున్న వీరు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకోని అక్కడ పరిస్థితిని మంత్రికి ఫోన్‌ద్వారా వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి ఫోన్‌లో ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని, శాశ్వత వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలుసిద్ధం చేయాలని ఆర్అండ్‌బి డిఈ, ఈఈ, ఎస్ఈ, జేఈలను ఆదేశించారు. పాల్వంచ దమ్మపేట మధ్య భారీ వాహనాలనుసత్తుపల్లి మీదుగా, చిన్న వాహనాలను మాదారం, అన్నపు రెడ్డిపల్లి, బుగ్గ పాడుమీదుగా మళ్లించారు త్వరలోనే వంతెన నిర్మాణం చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- పాల్వంచలో 360 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లక్కీడ్రా
- అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు : ఎమ్మెల్యే

పాల్వంచ సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించామని, అర్హులైన ప్రతి ఒక్కరికీప్రభుత్వ నిబంధలన ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మున్సిపాల్టీ పరిధిలోని మొత్తం 27డివిజన్లకు చెంది న అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు పెద్దమ్మతల్లి ఆలయ ఫంక్షన్ హాల్లో డబ్లుఽబెడ్‌రూమ్ ఇళ్ల లక్కీడ్రా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ అంకిత్, మేయర్ మూడ్ గణేష్ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టారు. పాల్వంచ మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 360డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం అనుమతించిందని, మొత్తం 27డివిజన్ల నుంచి వీటి కోసం 4,611దరఖాస్తులు అందగా, క్షేత్రస్థాయిలో విచారణ, అర్హతల పరిశీలన అనంతరం 1,254మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల కేటాయింపులో సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు అమలు చేశారు. గతంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ప్రక్రియ కొన్ని కారణాల వల్ల ఆలస్యమైందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న ఇళ్ల కంటే అర్హులైన దరఖాస్తు దారులు అధికంగా ఉన్నందున లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయాల్సి వచ్చిందన్నారు. గతంలో కొంతమంది కుటుం బాలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందుతాయనే హామీతో తమ నివాసాలను ఖాళీ చేసిన పరిస్థితులు ఉన్నాయని, అయితేప్రస్తుతం అర్హుల జాబితాలో వారిపేర్లులేని విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి కుటుంబాల సమస్య లను ప్రస్తుతం లక్కీ డ్రాతో కలపకుండా సిఎం లేదా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా పరిష్కారం కోసం కృషిచేస్తామన్నారు. ప్రస్తుత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి గందరగోళం లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధానాన్ని అనుసరించడం ముఖ్యమన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికప్రక్రియను పూర్తి పాదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. లక్కీ డ్రా ప్రక్రియను ప్రజల సమక్షంలో ప్రత్యక్షంగా నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ మార్గదర్శ కాలు, రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిలో నేలబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలు, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం కేటాయింపులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇళ్ల కేటాయింపు పేరుతో ఎవరైనా డబ్బులు అడిగినా, దళారులు



సంప్రదించినా నమ్మవద్దని సూచించారు. లబ్ధిదారులు ఎలాంటి మధ్యవర్తులకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మేయర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, కలెక్టర్ సమన్వయంతో లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిం చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరంచిన్నారుల చేతులమీదుగా ముందుగా లక్కీ డ్రా నిర్వహించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే, కలెక్టర్, మేయర్ చేతులమీదుగా ధృవ పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు, కమి షనర్ సుజాత, డిసిఎంఎస్‌మాజీ చైర్మన్‌కొత్వాల శ్రీనివాసరావు, తహశీల్దార్ దారాప్రసాద్, గృహ నిర్మాణశాఖపీడీ సవేరాం, ఇందిరమ్మ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల అర్హులు, ప్రజలు సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నేరెళ్ల శారదకు ఆత్మీయ సన్మానం..

- శుభాకాంక్షలు తెలియజేసిన కాల్వ సుజాత గుప్త..



హైదరాబాద్, సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రెండవసారి నియమితురాలైన నేరెళ్ల శారదకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.. ఆమె శుక్రవారం రోజు తన బాధ్యతలు స్వీకరించారు.. ఈ సందర్భంగా ఆమెను కలిసి అభినందించారు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత గుప్త.. ఈ క్రమంలో శారదని దుశ్శాసలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సంపత్‌రెడ్డి కుటుంబానికి ఎస్‌జిఇఎఫ్ ఆర్థిక సాయం

- ఆపదలో ఉన్నవారికి మాఫౌండేషన్ ముందుంటుంది : సురేష్‌రెడ్డి



పాల్వంచ సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన కూసా సంపత్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న శ్యామలగోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎన్.సురేష్‌రెడ్డి మృతుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసహాయాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ టీం సభ్యులు వి.రామకృష్ణారెడ్డి, పాషా, పి.వినయ్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

## అక్టోబర్ 1న జానపద కళాకారుల ఆత్మీయ సమ్మేళనం

- గోదావరిఖనిలో కళాభవన్, తెలంగాణలో జానపద అకాడమీ ఏర్పాటుకు డిమాండ్



గోదావరిఖని, సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : గోదావరిఖనిలో కళాభవన్ నిర్మాణం, తెలంగాణలో జానపద అకాడమీ, యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు కళాకారుల సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా ఉద్యమించాలని తారా ఆర్ట్స్ అకాడమీ పిలుపునిచ్చింది. గురు వారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేష్, గౌరవ సలహాదారు కే.స్వామి మాట్లాడుతూ.. ఈ సమస్యలపై చర్చించేందుకు అక్టోబర్ 1న దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ఉమ్మడి పెద్దపల్లి, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల కళాకారులతో భారీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.2018లో ప్రారంభమైన తారా ఆర్ట్స్ అకాడమీ ద్వారా వేలాది మంది జానపద, శాస్త్రీయ కళాకారులను జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రోత్సహిస్తున్నామని,అయితే రాష్ట్రంలో కళనే నమ్ముకున్న కళాకారులు తగిన ప్రోత్సాహం లేక ఆర్థిక, అనారోగ్య సమస్యలతో అల్లకల్లోలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిఖని ప్రాంతంలో నలభై ఏళ్లుగా కళాభవన్ లేక కళాకారులు సరైన వేదికకు నోచుకోలేక పోతున్నారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి స్థానిక అమర కవి లేదా కళాకారుడి పేరిట కళాభవన్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు.అలాగే కళాకారుల గుర్తింపు కార్డుల ఆధారంగా ఉచిత బస్సు, రైలు పాసులు,హెల్త్ కార్డులు, పర్యాటక ప్రదేశాల ఉచిత సందర్శన సదుపాయం కల్పించాలని,10 ఏళ్లకు పైగా సేవలందిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు, వృద్ధాప్య పింఛన్లు,నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని కోరారు. ఈ డిమాండ్లను రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లేందుకు వారిని సమ్మేళనానికి ఆహ్వానించినట్లు పేర్కొంటూ, కళాకారులంతా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అకాడమీ ప్రతినిధులు పెద్దుల శ్రీనివాస్, చల్లా ప్రవీణ్ కుమార్, సీనియర్ కళాకారులు దామెర శంకర్, మేజిక్ రాజా, చంద్రపాల్ పాల్గొన్నారు.

## వంతెనకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు

- రూ.5కోట్ల నిధులతో పాములేరు వాగుపై వంతెన నిర్మాణం : ఎమ్మెల్యే



ములకలపల్లి సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : ములకలపల్లి మండలం కంపగూడెం శివారులో కూలిపోయిన పాములేరు వాగు వంతెనకుప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే జారే ఆది నారాయణ సూచించారు. గురువారం వంతెన స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ప్రజల రవాణా కష్టాలను తీర్చేందుకు త్వరలోనే రూ.5కోట్ల నిధులతో నూతన వంతెన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు స్పష్టంచేశారు. అనంతరం వంతెన కూలిపోవడంతో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చేపడుతున్న ప్రత్యా మ్నాయ మార్గాలపై ఎంపిడిఓ సత్యనారాయణ, ఆర్అండ్‌బి డీఈ విశ్వనాథ్, ఎస్ఐ మధుప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ నరేష్‌కుమార్ తదితర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాల్వంచ వైపువెళ్లేభారీ వాహనాలను సత్తుపల్లి మీదుగా దారి మళ్లించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నా రు. ఆయా మండలాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ.. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటిసి అంజి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, సుమిత్, రాజేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం కరకట్ట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

- భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు : ఎస్పీ



భద్రాచలం సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) : భద్రాచలం కరకట్ట వద్ద నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను జిల్లాఎస్పీ రోహిత్ రాజు గురువారం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతోపాటు సంబంధిత శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వర్షాకాలం నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి జాప్యం, అంతరాయం లేకుండా అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. భక్తుల రాకపోకలు, విగ్రహాల తరలింపు, ట్రాఫిక్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిమజ్జన వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చేఅవకాశం ఉన్నందున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే భక్తులు గణేష్ శోభాయాత్ర నిర్వాహకులను ముందుగానే రూట్ మ్యాప్‌వివరాలను స్పష్టంగా తెలియచేయాలని సూచించారు. పోలీసుశాఖసూచించే మార్గాల్లోనే ప్రయాణిస్తూ, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలనికోరారు. శోభాయాత్ర నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. నిమజ్జన సమ యంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు భద్రాచలం బ్రిడ్జి, బస్టాండ్, అంబేద్కర్ సెంటర్, కూనవరంరోడ్, డిగ్రీకాలేజీ, కరకట్ట, కరకట్ట నిమజ్జన పాయింట్ మార్గంలోట్రాఫిక్‌ను క్రమబద్ధీ కరించేలా చర్యలు చేపట్టారు. నిమజ్జన పాయింట్‌వద్ద టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టంచేశారు. నదిలోకి ప్రమాదకరంగా దిగడం, బారికేడ్లు దాటి వెళ్లడం, నిషేధిత ప్రాంతాల్లో నిలబడటం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు.

నిమజ్జన విగ్రహాలను తరలించే వాహనాల కదలికలకు అంతరాయం కలగకుండా మార్గాలను ఖాళీగా ఉంచాలని, వాహనదారులు పోలీసుల సూచనలకు అనుగుణంగా ప్రయాణించాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ అధికారులకు సహకరించి శాంతియుతం గా సురక్షిత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అరుణ్‌కుమార్, పోలీసు అధికారులు, రోడ్డుట్రాన్స్పోర్ట్ అధికారులు, ఇతర శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఖమ్మం జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు 41 మంది నామినేషన్ల దాఖలు

**ఖమ్మం , సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఖమ్మం జిల్లా శాఖ తదుపరి మేనేజింగ్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని, ఎన్నికలలో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల నుంచి గురువారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించగా, మొత్తం 41 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి, ముఖ్య ప్రణాళికా అధికారి ఏ. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నట్లు, నామినేషన్ల ఉపసంహరణకు సెప్టెంబర్ 26న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు గడువు ఉన్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. పోటీదారుల తుది జాబితాను సెప్టెంబర్ 26న మధ్యాహ్నం 3.00 గంటలకు ప్రకటించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ను అక్టోబర్ 4, 2026న ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు స్థానిక టీటీడీసీ భవనం, ఇల్లందు క్రాస్ రోడ్ లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఖమ్మం జిల్లాలో 11 ఆహార భద్రతా కేసుల పరిష్కారం, రూ 2.90 లక్షల జరిమానా

**ఖమ్మం , సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**ఖమ్మం జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల అమలులో భాగంగా గౌరవనీయ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సమక్షంలో, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్. లోకేష్ ఆధ్వర్యంలో నమోదైన 11 కేసులను పరిష్కరించి, సంబంధిత ఆహార వ్యాపార సంస్థలపై మొత్తం రూ 2,90,000/- జరిమానా విధించారు.జరిమానా విధించిన ముఖ్యమైన సంస్థలు:రమేష్ ధాబా – రూ 1,00,000/-హవేలీ – రూ 75,000/-రిలయన్స్ రిటైల్ – రూ రూ 50,000/-డిలైట్ మండీ – రూ 20,000/-జాజూ – రూ 20,000/-ఇతర కేసులు, మిగిలిన వాటికి జరిమానా విధించారు. ఆహార వ్యాపార సంస్థలు పరిశుభ్రత, నాణ్యత, ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ఎఫ్ ఎస్ ఎస్ ఏఐ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా ఖమ్మం జిల్లా ఆహార భద్రతా శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు, నమూనాల సేకరణ, అమలు చర్యలు నిరంతరం కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్. లోకేష్ తెలిపారు.

# వల్లభనేని గురవయ్య కి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, సెప్టెంబరు 25**

**(జర్నలిస్ట్ ఫైల్) :** కారేపల్లి మండలం విశ్వనాధపల్లి గ్రామం నందు మాజీ ఆర్టివో మెంబెర్, బీఆర్ఎస్ నాయకులు వల్లభనేని రామారావు తండ్రి గురవయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గురువారం వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురవయ్య ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.కార్యక్రమంలో నాయకులు కూరాకుల వలరాజు, ముత్యాల సత్యనారాయణ,వీరు నాయక్, లక్షణ్ నాయక్, దేవభక్తిని కిషోర్, వెంకయ్య, శ్రీనివాసరావు, సురేష్, వీరేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షంతో అవస్థలు





**ఖమ్మం, సెప్టెంబరు 25**

**(జర్నలిస్ట్ ఫైల్) :** మండలం లోని వివిధ గ్రామాలలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వలన ప్రజలు అవస్థలు పడ్డారు. గురువారం కురిసిన వర్షం కు మంగాపురంతండా లో భూక్యా శివాజీ కి చెందిన ఇల్లు శిధిలావస్థలో ఉండటంతో పై కప్పు కూలింది. దీంతో ఇంటిలో ఉన్న సామాన్లు తడిసి ముద్దెయ్యాయి. దీంతో ఆ కుటుంబం బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాయి. మండలంలోని నాచేపల్లి–మంగాపురం గ్రామాల మధ్య రహదారి పై చెట్టు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టారు. వివిధ గ్రామాలలో వర్షాలకు ప్రజలకు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు స్థానిక పంచాయతీ అధికారులను ఆదేశించారు. నాచేపల్లి రహదారి లో నిలిచిన రాకపోకల పై మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల 'సీతారాములు అప్రమతం చేశారు. చెట్లు తొలిగింపు పనులను పరిశీలించారు. మండలం లోని పలు కార్యాలయాలు, రహదారులు వర్షంకు తడిసి చిత్తడిగా మారాయి. చెరువుమాధారం చెరువు అలుగు పోసేందుకు చేరువలో ఉంది.

# రైతులు ఫార్మర్ రిజిష్టర్ చేయించకపోతే అన్ని బంద్

- 30 తో ముగుస్తున్న గడువు, సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లాలో 532.4.యం.యం. వర్షం నమోదు
- 378 గ్రామాలలో డిజిటల్ సర్వే శర వేగంగా సాగుతుంది
- 5.40 లక్షల ఎకరాలలో ఖరీఫ్ సీజన్ లో సాగు





**ఖమ్మం , సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**

రైతులు ఫార్మర్ రిజిష్టర్ చేయించకపోతే అన్ని బంద్ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతులకు పంట కొనుగోలు తో పాటు, ఎరువుల విక్రయాలు ఇతరత్రా సేవలకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జిల్లా లో 77.862. మంది రైతులకు గాను, ఇంకా 76 వేల మంది రైతులు రిజిస్ట్రేషన్చేయించు కోలేదన్నారు. వీరికి సమస్యలు తలెత్తకుండా వెంటనే చేయించాలన్నారు. ఈ నెల 30 లోపు చేయించకపోతే వారికి రాయితీలు రావని తెలిపారు. రైతాంగం కు 761.6 యం.యం. వర్షపు శాతం అవసరం కాగా ఇప్పటి వరకు 532.4 యం.యం. శాతం కురిసిందన్నారు. ఇంకా రెండు రోజులు ఇలా వర్షాలు కురిస్తే మిగిలిన 30 శాతంతో జిల్లాకు నీరు సరిపోతుందన్నారు. 18 మండలాలలో నీటి శాతం తక్కువగా ఉందన్నారు. కల్లూరు, కామేపల్లి, తల్లాడ మండలాలలో సాధారణ స్థితికి చేరిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 378గ్రామాలలో డిజిటల్ సర్వే 50 శాతం వరకు పూర్తి చేశామని, మరో 15 రోజులలో సర్వే ను పూర్తి చేస్తామన్నారు. సర్వే విషయం పై రైతులకు మెస్సెజ్ వస్తుందన్నారు. తప్పులు ఉంటే 72 గంటలలో సరిదిద్దుతారని పేర్కొన్నారు. జిల్లా లో 2,30,397 ఎకరాలలో వరి, 2, 35,637 ఎకరాలలో పత్తి, 30,169 ఎకరాలలో పెసర, 682 ఎకరాలలో కందులు, 333 ఎకరాలలో మినుములు, 1246 ఎకరాలలో చెరుకు ఇతరత్రా పంటలు కలిపి మొత్తం 5.40 లక్షల ఎకరాలలో పంటలు సాగులో ఉన్నట్లు తెలిపారు. ఈ వర్షాలు వలన అన్ని పంటలు సేఫ్ గా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో గత ఏడాది కంటే యూరియాను అధికంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. గతేడాది 32.405 యం.టీ. లు వినియోగిస్తే, ఈ సీజన్ ఇప్పటి వరకు 39,618 యం.టీ. లను రైతులు అందించినట్లు తెలిపారు. యూరియా కు డోకాలేదన్నారు. వర్షాల పట్ల రైతులు 'అప్రమతంగా ఉండాలని సూచించారు. పొలాలలో నీరు నిల్వ లేకుండా తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల వ్యవసాయాధికారి యం.రాధ ఉన్నారు.సాయి చరణ్,స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పి ఆర్ ఓ బండారి తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్నేరు వరద పరిస్థితిపై అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో సమీక్ష
- విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకవద్దు
- చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**ఖమ్మం , సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**

అకాల వర్షాల నేపథ్యంలో ఖమ్మం నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ సూచించారు.వర్షాలు కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నారులు వర్షపు నీటిలోకి వెళ్లకుండా, విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.మరోవైపు మున్నేరు వరద పరిస్థితిపై చైర్మన్ సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. మున్నేరు ప్రవాహానికి సంబంధించిన ఎగువ ప్రాంతాలు, మున్నేరులో కలిసే అకేరు, పాలేరు పరివాహక ప్రాంతాలతో పాటు ఖమ్మం రూరల్, పోలేపల్లి, తీర్దాల తదితర పరిసర ప్రాంతాల్లో వర్షపాతం, వరద ఉధృతి, నీటి మట్టం పరిస్థితిపై అధికారులు అందిస్తున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.మున్నేరు పరివాహక ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సుడా చైర్మన్ కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు."ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి" అని సుడా చైర్మన్ శ్రీ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భద్రాచలం కరకట్ట వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**ఖమ్మం, భద్రాచలం, సెప్టెంబరు 25 (జర్నలిస్ట్ ఫైల్) :**

భద్రాచలం కరకట్ట వద్ద నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు.వర్షాకాలం నేపథ్యంలో నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి జాప్యం, అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. భక్తుల రాకపోకలు, విగ్రహాల తరలింపు, ట్రాఫిక్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నిమజ్జన వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో పటిష్ట పోలీసు బందోబస్తు, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్స్ ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది, అందుబాటులో ఉండాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే భక్తులు, గణేష్ శోభాయాత్ర నిర్వాహకులకు ముందుగానే రూట్ మ్యాప్ వివరాలను స్పష్టంగా తెలియజేయాలని ఎస్పీ సూచించారు. పోలీసు శాఖ సూచించే మార్గాల్లోనే ప్రయాణిస్తూ, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. శోభాయాత్ర నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.నిమజ్జన సమయంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు భద్రాచలం బ్రిడ్జి – ఐజీ సెంటర్ – బస్టాండ్ – అంబేద్కర్ సెంటర్ – కూనవరం రోడ్ – డిగ్రీ కాలేజ్ – కరకట్ట – కరకట్ట నిమజ్జన పాయింట్ మార్గంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టారు. కరకట్ట నిమజ్జన పాయింట్ వద్దకు వచ్చే వాహనాల్లో ఇద్దరికి మించి వ్యక్తులు ప్రయాణించకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనాలను నిర్దేశిత ప్రాంతాల్లోనే పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా పోలీసు సిబ్బంది సూచించే ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.నిమజ్జన పాయింట్ వద్ద టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నదిలోకి ప్రమాదకరంగా దిగడం, బారికేడ్లు దాటి వెళ్లడం, నిషేధిత ప్రాంతాల్లో నిలబడటం వంటి చర్యలకు ఎవరూ పాల్పడరాదని సూచించారు. నిమజ్జన విగ్రహాలను తరలించే వాహనాల కదలికలకు అంతరాయం కలగకుండా మార్గాలను ఖాళీగా ఉంచాలని, వాహనదారులు పోలీసుల సూచనలకు అనుగుణంగా ప్రయాణించాలని ఎస్పీ సూచించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.భక్తులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీసు శాఖ సూచించే భద్రతా, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, అధికారులకు సహకరించి శాంతియుతంగా, సురక్షిత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో డీఎస్పీ అరుణ్ కుమార్, పోలీసు అధికారులు, రోడ్డు ట్రాన్స్పోర్ట్ అధికారులు, ఇతర శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యం: జిల్లా ఎస్పీ



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డేలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని సిబ్బంది నుంచి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, ఇతర పరిపాలనా అంశాలపై వినతులను స్వీకరించారు. ప్రతి వినతిని పరిశీలించిన ఎస్పీ, శాఖ నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో సామర్థ్యం, నిబద్ధత, ఉత్సాహం పెరుగుతాయని ఎస్పీ తెలిపారు. బదిలీలు, పదోన్నతులు తదితర నిర్ణయాలను నిబంధనలు, ఖాళీలు, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా చేపడతామన్నారు. సిబ్బంది తమ సమస్యలను సంకోచం లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావంతో పనిచేస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు.

## ఆర్టీజీఎస్ 360°తో కిడ్నాప్‌కు గురైన నాలుగేళ్ల బాలిక సురక్షితంగా గుర్తింపు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** :ఆర్టీజీఎస్ 360° సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సహాయంతో కిడ్నాప్‌కు గురైన నాలుగేళ్ల బాలికను లాలాపేట పోలీసులు సురక్షితంగా గుర్తించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ పర్యవేక్షణలో, లాలాపేట సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. బాలికను పసుపులేటి సాయి మనోజ్ కుమార్, అతని భార్య షేక్ సుమాయ తీసుకెళ్లినట్లు గుర్తించిన పోలీసులు గుంటూరు, విజయవాడ బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో గాలింపు చేపట్టారు. ఆర్టీజీఎస్ 360° ద్వారా బాపట్ల రైల్వే స్టేషన్ పరిసరాల్లో వారి కదలికలపై అలర్ట్ రావడంతో పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని బాలికను సురక్షితంగా గుర్తించారు.

తమకు పిల్లలు లేనందున బాలికను తమ వద్ద పెంచుకోవాలనే ఉద్దేశంతో తీసుకెళ్లినట్లు నిందితులు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. లాలాపేట పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 293/2026 కింద బీఎన్ఎస్ 137(2) సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించే చర్యలు చేపట్టారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ ఎస్.కె. హాషీమ్, హెచ్‌సీ 6525 ఎస్‌కే.ఎం.డి. షరీఫ్, పీసీలు పి. కిరణ్ కుమార్, పి. శంకర్‌లను పోలీసు అధికారులు అభినందించారు.

## ఘనంగా 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త




- ఎం ఎస్ ఎం ఈ వర్క్ షాప్..
- పాల్గొన్న ప్రముఖులు

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ )**:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా కేంద్రంలో జిల్లా పరిశ్రమల కేంద్రం (డి ఐ సి ) ఆధ్వర్యంలో స్థానిక సాయిరాం గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో 'ఎంఎస్‌ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్ – ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమం ఒక్కరోజు వర్క్‌షాప్‌గా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) తెన్నేటి కృష్ణ ప్రసాద్ తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదటగా అతిథులందరూ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రసంగించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆశయమైన ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యం గురించి, ఎంఎస్‌ఎంఈ రంగం ద్వారా లభించే ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ రాయితీలు మరియు ఆర్థిక సహాయం గురించి ఎమ్మెల్యే వివరించారు. స్థానిక యువత, పారిశ్రామిక ఆసక్తి గల వారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికంగా రాణించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జి యం. డి ఐ సి, వై. రామకృష్ణ,ఏ పి స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ మేనేజర్ రామాంజనేయులు,యల్ డి యం. శివకృష్ణ,ఏ పి ఐ ఐ సి జోనల్ మేనేజర్ నరసింహా రావు,ఇండియా ఎస్ ఎం ఎం ఈ ఫార్మ్ మల్లిఖార్జున, డిఆర్డీఏ,మెప్మా పి డి లు,బి.సింగయ్య, ఆనంద సత్యపాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ రకాల సంస్థల పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ వైభవాన్ని మరింత పెంచాలి

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ వైభవాన్ని మరింత పెంచాలని, నూతనంగా ఎన్నికయిన కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ సభ్యులను సూచించారు. శుక్రవారం గుంటూరు కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి హాజరయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీగా ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కొరిటెపాడు వాకింగ్ ట్రాక్ పశ్చిమ నియోజకవర్గంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన వాకింగ్ ట్రాక్‌లలో ఒకటిగా గుర్తింపు పొందిందని, సుమారు 800 మీటర్ల పొడవుతో ఉన్న ఈ ట్రాక్ గత 25 ఏళ్లుగా వేలాది మందికి ఆరోగ్యం, ఆనందాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సింగంశెట్టి కోటేశ్వరరావు ఎంతో కష్టపడి, నిజాయితీగా పని చేసే వ్యక్తి అని, ట్రాక్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. కమిటీ సభ్యులందరూ సమిష్టిగా సహకరించి ట్రాక్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

కార్యక్రమంలో పలువురు పెద్దలు ట్రాక్ వద్ద బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం, వెనుక వైపు గేటు కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడం వంటి సూచనలు చేశారని, వాటిని పరిశీలించి సాధ్యమైన మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొత్త కమిటీ స్థానిక సమస్యలను పరిష్కరించుకుంటూనే ట్రాక్ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు సహకరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో అందరి సహకారంతో కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## దోమల నివారణతోనే ఆరోగ్యవంతమైన సమాజం : అందే బాలశౌరి వెల్లడి!




**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)** : దోమల నివారణతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్య పడుతుందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి అన్నారు.

స్థానిక పట్టణమలేరియా సిబ్బందితో కలసి చంద్రబాబు నాయుడు కాలనీ,రావి రవీంద్రనాథ్ కాలనీలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దోమలు పెరుగుదలకు అవకాశం ఉన్న మూలాలను గుర్తించి వాటిని తొలగింప చేశారు. ఫ్రైడే, డ్రై డే కార్యక్రమము యొక్క ప్రాముఖ్యతను, దోమల నివారణ యొక్క ఆవశ్యకతను గురించి ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల విద్యార్థులకు, స్థానిక ప్రజలకు దోమల నివారణకు తీసుకునవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కలిగించడంతోపాటు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాలు కురవడం వల్ల నీటి నిల్వలలో దోమలు గుడ్లు పెట్టి వాటి యొక్క సంతతిని పెంచుకొనుట ద్వారా మలేరియా , డెంగ్యూ ,చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు వంటి అనేక వ్యాధులు వ్యాప్తి చెందటానికి కారణం అవుతాయని,

ప్రజలు వర్షాకాలంలో ఎక్కడ నీరు నిల్వఉండకుండా అప్రమత్తంగా ఉండాలని,నీటి నిల్వల పై మూతలు పెట్టి ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం

స్థానిక ఆరోగ్య సిబ్బందితో కలిసి ఫ్రైడే,డ్రై డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ అందెబాలచంద్రమౌళి మాట్లాడుతూ

దోమ కాటునుండి రక్షణ పొందుటకు సాయంత్రం సమయంలో తలుపులు కిటికీలు మూసి ఉంచాలని ఆయన అన్నారు. అదేవిధంగా పూర్తి వస్త్రధారణ ధరించాలని, దోమతెరలు, ఇతర దోమ కాటు నుండి రక్షించుకునే విధానాలను వాడుకోవాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బండి విజయకుమార్, ఉపాధ్యాయురాలు షేక్ షమీమ్, మలేరియా సూపర్వైజర్ దాసరి శివ నాగమల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు , హెల్త్ అసిస్టెంట్స్ నవీద్, రషీద్, శ్రీనివాస్, కరిముల్లా,శరత్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 7 వరకు అంగన్‌వాడీ ఉత్సవాలు

- సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు రోజుల కార్యక్రమాలు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** : "సేవా సంకల్ప్ అభియాన్"లో భాగంగా జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో 2026 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు అంగన్‌వాడీ ఉత్సవాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ - మున్సిపల్ పరిపాలన, డి.ఆర్.డి.ఏ, మెప్మ, వ్యవసాయ, పశుసంవర్ధక, శాఖలతో సమన్వయం చేయాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించాలని అన్నారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తల్లులు, చిన్నారులను భాగస్వామ్యం చేస్తూ పండుగ వాతావరణంలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఆశా కార్యకర్తలను వారి సేవలకు గుర్తింపుగా ప్రజల సమక్షంలో అభినందించడంతో పాటు, కొంత మంది లబ్ధిదారులైన తల్లులను సన్మానించాలని సూచించారు.

పోషకాహారం, మాతా శిశు ఆరోగ్యం, టీకాలు, శిశు అభివృద్ధి, చిన్నారుల సంరక్షణ, మహిళా సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన ప్రభుత్వ పథకాలు, సేవలపై అవగాహన కల్పించాలని చెప్పారు. చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అందించిన తెలుగు కామిక్ పుస్తకాన్ని ఉపయోగించి కథల రూపంలో కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్నారులకు ఆటలు, చిత్రలేఖనం, పాటలు, కథలు, పద్యాలు, చిన్నచిన్న సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి వారిని ఉత్సాహంగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. జిల్లాలో అన్ని శాఖల అధికారులు గ్రామ స్థాయిలో అంగన్‌వాడీ ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని అన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో అవగాహన, ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహించి, కార్యక్రమాల నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

## ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ )**:బాపట్ల జిల్లా నరసాయపాలెంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (ఎన్ డి డి ) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డా. వినోద్ కుమార్ వి., ఐ.ఏ.ఎస్. ప్రారంభించి, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి అధికారులు మాట్లాడుతూ, నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. మాత్రలు తీసుకోకపోతే పిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలు, రక్తహీనత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేస్తూ అంటువ్యాధుల నివారణకు చేతులు సరైన పద్ధతిలో ఎలా కడుక్కోవాలో ప్రదర్శన ద్వారా విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డి ఎం హెచ్ ఓ ) డా. ఎస్. విజయమ్మ, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ రాష్ట్ర నోడల్ అధికారి మరియు జేడి – ఎంహెచ్ ఎన్ డా. సతీష్ కుమార్, సంబంధిత కార్యక్రమ అధికారులు, నరసాయపాలెం పీహెచ్‌సి వైద్యాధికారి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పురుగు మందుల నాణ్యత, నిల్వలు, పంపిణీపై నిరంతర నిఘా



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** : పురుగు మందుల నాణ్యత, నిల్వలు, పంపిణీపై వ్యవసాయ శాఖ నిరంతర నిఘాతో పని చేస్తోందని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తయారీ యూనిట్ లను, గోదాములు, డీలర్ పాయింట్లలో రికార్డులు, బ్యాచ్ నెంబర్లు, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అగ్రికల్చర్ ఆఫీసర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు తనిఖీ చేస్తున్నారని చెప్పారు. ప్రతి సంవత్సరం జిల్లాలో శత శాతం లక్ష్యాలతో పురుగు మందుల నమూనాల సేకరణ జరుగుతోందని వివరించారు. ప్రస్తుత 2026 – 27 సంవత్సరానికి 1,015 నమూనాల వార్షిక లక్ష్యానికి సంబంధించి క్షేత్ర స్థాయి అధికారులు నమూనాలు సేకరించి నాణ్యతా ప్రమాణాల విశ్లేషణకు నమూనాలను కోడింగ్ సెంటర్ కు పంపించడం జరుగుతోందని చెప్పారు.

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లోను, రాబోవు రబీ పంట కాలములో అన్నీ తయారీ యూనిట్లు, డిస్ట్రిబ్యూటర్ల పాయింట్లు, డీలర్ పాయింట్లను పూర్తిగా తనిఖీలు చేసి నిబంధనలు పాటించని డీలర్లపై పురుగు మందుల చట్టం 1968 ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. గడువు ముగిసిన పురుగు మందులను ప్రత్యేకంగా నిల్వ వుంచి వాటిని సరైన పద్ధతిలో నిర్వీర్యం చేయవలసి ఉందన్నారు. గడువు ముగిసిన పురుగు మందులను ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసి విడిగా ప్రత్యేకంగా వుంచడం జరుగుతుందని చెప్పారు. గడువు దగ్గరగా వున్న పురుగు మందులను దుకాణదారులు ఆయా కంపనీలకు తిరిగి పంపడం జరుగుతుందని వివరించారు.

ఇన్సెక్టిసైడ్స్ యాక్ట్–1968 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించినా, మిస్బ్రాండెడ్ మరియు గడువు ముగిసిన మందుల అమ్మకాలకు యత్నించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అటువంటి దుకాణాలు/సంస్థల లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో వ్యవసాయ శాఖ పూర్తి అప్రమత్తతతో వ్యవహరిస్తోందన్నారు.

జిల్లాలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి పట్టణ, మండల స్థాయిలో అన్ని పురుగు మందుల దుకాణాలను, తయారీ కేంద్రాలను, ట్రాన్స్ పోర్టు ఆఫీసులను, అనుమానిత ప్రదేశాల్ని తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా శుక్రవారం కూడా తనిఖీలు తమ అధికారులు నిర్వహించారన్నారు. పురుగు మందుల నాణ్యతలో లోపాలు ఉన్నట్లు గమనించినా లేదా ధరలపై అనుమానం వచ్చినా రైతులు వెంటనే వ్యవసాయాధికారికి గానీ లేదా జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు తనిఖీలు చేపట్టి సంబంధిత పురుగు మందుల డీలర్ పై పురుగు మందుల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

పురుగు మందుల డబ్బా/ పాకెట్ పై, తయారీదారైన కంపెనీ, మార్కెటర్, తయారీ తేదీ, ఎక్స్పైరీ తేదీ వంటి వివరాలు పొందుపరచడం జరుగుతుందని అన్నారు. ఈ లేబుళ్ల ఆధారంగా రైతు కావలసిన పురుగు మందును కొనుగోలు చేస్తారని, సంబంధిత వ్యవసాయాధికారులు పైవివరాలను తనిఖీ చేసి పురుగు మందుల నమూనాలను సేకరించడం జరుగుతుందన్నారు. ఎక్స్పైరీ తేదీ, నెలల ముందుగానే సంబంధిత డీలరుకు తెలియజేసి సదరు కంపెనీకి తిరిగి పంపించవలసినదిగా చెప్పడం జరుగుతోందన్నారు.

## ప్రతినిత్యం ప్రజలతోనే..



- ఇళ్ల స్థలాల మంజూరుపైబప్రత్యేక దృష్టి
- ప్రజా దర్బార్ లో అర్జీలు స్వీకరించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** :ప్రజలకు ఏ కష్టమొచ్చినా తాము అందుబాటులో ఉండి పరిష్కరిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా అర్జీలు స్వీకరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి పొజిషన్ ఎక్కడ ఉందో ఇప్పటి వరకు చూపించలేదని అర్జీలో పేర్కొన్నారు. సొంతిల్లు లేక ఇబ్బంది పడుతున్నామని, నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. రేషన్ కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ అర్జీని స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్, అర్హులైన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి, అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు ప్రజలందరికీ చేరేలా నిరంతరం అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలోనే కాకుండా ప్రతి రోజూ వార్డుల పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. వార్డుల్లో కూటమి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వాన్ని చేరువ చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మంచి పాలన సాగుతోందన్నారు.

## సైబర్ బాధితులకు భారీ ఊరట

### 1,119 మందికి రూ.31.75 లక్షలు రీఫండ్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** : సైబర్ మోసాలకు గురైన 1,119 మంది బాధితులకు గుంటూరు జిల్లా సైబర్ సెల్ రూ. 31.75 లక్షల నగదును తిరిగి అందించింది. కేంద్ర హోంశాఖ ప్రవేశపెట్టిన మనీ రెస్టొరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం) విధానాన్ని జూన్ 2026 నుంచి అమలు చేస్తుండగా, సెప్టెంబరు 25 నాటికి బాధితులకు నగదు రీఫండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ నిషార్ భాష ఆధ్వర్యంలోని ఐటీ కోర్ టీం ఈ చర్యలు చేపట్టింది.

సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే మోసగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిన నగదును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశం పెరుగుతుందని తెలిపారు. ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని, అధిక లాభాలు, ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో డబ్బులు డిమాండ్ చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్)** : ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన కట్ట భూషణం (హెచ్‌సీ--1849) అనారోగ్యంతో ఈ ఏడాది జూన్ 4న మృతి చెందారు. ఆయన కుటుంబానికి చేయూత పథకం కింద గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం రూ. 1 లక్ష చెక్కును భూషణం భార్య కట్టా సామ్రాజ్యానికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మైలా సాంబశివరావు, జాయింట్ సెక్రటరీ ఎం. లక్ష్మయ్య, గుంటూరు పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్)**:ఐసీడీఎస్ కాకుమాను మండలం శాఖ ఆధ్వర్యంలో 9 వ జాతియా పోషణ మాసత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ మాట్లాడుతూ ఈ అంగన్‌వాడీ ఉత్సవాలు 25 వ తేదీ నుండి అక్టోబర్ 8 వరకు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా రేటూరు, అప్పాపురం,కకుమాను సెంటర్‌లో అంగన్‌వాడీ ఉత్సవ కార్యక్రమం జరిగినట్లు తెలిపారు. అంగన్‌వాడీలో మధ్యాహ్నం పెట్టే భోజనం గురించి మరియు వాటిలోని పోషక విలువల గురించి వివరించి చెప్పారు. అలాగే గర్భిణీలు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు, అంగన్‌వాడీ వేలపాని తల్లులు, ఎన్నారై మరియు వచ్చిన తల్లులు, పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పి. వెంకాయమ్మ, కార్యకర్తలు, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## విజయవంతంగా 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం



○ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

**వేమూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు వేమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు కార్యక్రమంలో పాల్గొని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, రహదారులు, తాగునీరు, విద్యుత్, సంక్షేమం, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడిన నక్కా ఆనంద బాబు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా ప్రజలకు అందేలా 'మీకోసం' కార్యక్రమాన్ని సమర్థవంతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు పరిష్కార వేదికగా ప్రజాదర్బార్



○ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపించడమే ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సాధ్యమైన అంశాలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులో పరిష్కరించే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ప్రజల కోసం తన కార్యాలయ తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

○ తిరుపతిలో 27న రాయలసీమ రణభేరి సదస్సు

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్) :** వినుకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాయలసీమ రణభేరి సదస్సు పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, వైద్య మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సుకు రాయలసీమ జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతన స్కేలు, సంక్షేమ పథకాలు, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని మాచర్ల బుజ్జి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు వేతనాల పెంపు చేసిన నేపథ్యంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పెరిగిన రేట్ల ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు బాలకృష్ణ, సోమమ్మ, చంద్రకళ, వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇ.వి.ఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కేంద్రంలోని ఇ.వి.ఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఇ.వి.ఎంలు భద్రపరిచిన గదుల వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు, సీల్‌లను పరిశీలించారు.

ఇ.వి.ఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె.ఖాజావలి, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, తహసిల్దార్ కిరణ్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్.ఓంకార్, డా.టి.సేవ కుమార్, వై పిచ్చి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు ధర భరోసా.. వినియోగదారుడికి ధరల ఊరట : మంత్రి అచ్చెన్నాయుడు

○ రైతుబజార్లలో కిలో సన్నబియ్యం రూ.50.. ఉల్లిపాయలు రూ.35

○ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో చక్కీ గోధుమపిండి రూ.27కు సరఫరా

○ 8.81 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక

○ కొనుగోలు కార్యక్రమాలకు రూ.2,216.48 కోట్ల ఆర్థిక మద్దతు అవసరమని అంచనా

○ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర కార్యాచరణ: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, వినియోగదారులకు నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుబజార్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తూ ప్రజలపై ధరల భారం తగ్గిస్తున్నామన్నారు. మరోవైపు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించి, రైతులకు కొనుగోలు భరోసా కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ధరల పర్యవేక్షణ, నిత్యావసరాల ధరల స్థిరీకరణ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర, రబీ పంటల ప్రణాళికపై గురువారం రాత్రి మంత్రుల బృందం వర్చువల్ సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశంలో పాల్గొన్నారు. చర్చించిన అంశాలు, రూపొందించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆయన ఆదేశాలు, సూచనల మేరకు రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేలా కార్యాచరణ చేపట్టామన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సరుకులను అందించేందుకు రైతుబజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కేఎన్ఎం, బీపీటీ వంటి సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అన్ని రైతుబజార్ల ద్వారా ఉల్లిపాయలను కిలో రూ.35కు అందిస్తున్నామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన పామాయిల్, కందిపప్పును సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. చక్కీ గోధుమపిండిని కూడా కిలో రూ.27కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలు, బియ్యం, చికెన్, వంటనూనెలు, కందిపప్పు, మినుములు, వేరుశనగ, ఉల్లిపాయలు, గుడ్లు, టమాటా, అరటి తదితర 14 ప్రధాన వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ)లో ఆహార వస్తువులకు కేటాయించిన మొత్తం వెయిటేజీలో వీటి వాటా 57.37 శాతంగా ఉందన్నారు. అందువల్ల ఆయా వస్తువుల ఉత్పత్తి, సరఫరా, నిల్వలు, మార్కెట్ ధరలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

రాష్ట్ర వినియోగ అవసరాలు, పంటల ఉత్పత్తి, రైతులకు లభించే ధరలు, వాతావరణ అనుకూలత, మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని జిల్లాలవారీగా సమతుల్య పంటల ప్రణాళిక రూపొందించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8.81 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు వివరించారు. ఈ ప్రణాళికలో భాగంగా వరి సాగు నుంచి 3 లక్షల హెక్టార్లు, ఖరీఫ్‌లో సాగు కాని 4 లక్షల హెక్టార్లు, మిరప సాగు తగ్గిన 1.50 లక్షల హెక్టార్లను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించనున్నట్లు తెలిపారు. శనగలు 1.88 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.51 లక్షల హెక్టార్లు, మినుములు 1.27 లక్షల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు. పొద్దుతిరుగుడు 72 వేల హెక్టార్లు, పెసలు 68 వేలు, వేరుశనగ 62 వేలు, రబీ జొన్న 60 వేలు, కంది 46 వేలు, ఉల్లిపాయలు--బిందుసేద్యంతో కూరగాయలు 44 వేలు, రాగులు--కొర్రలు--ఇతర చిరుధాన్యాలు 38 వేలు, పచ్చిరొట్ట పంటలు 25 వేల హెక్టార్లలో సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా 1.08 లక్షల హెక్టార్లు, వైఎస్సార్ కడప, పల్నాడు జిల్లాల్లో చెరో 82 వేల హెక్టార్లు, నెల్లూరు జిల్లాలో 78 వేల హెక్టార్లలో ఎంపిక చేసిన పంటలను సాగు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.

ముఖ్యమంత్రి సూచనల మేరకు ముందస్తుగా నమోదు చేసుకున్న రైతుల నుంచి రాగులు, కందులు, మినుములను కనీస మద్దతు ధరకు 100 శాతం కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు అచ్చెన్నాయుడు వెల్లడించారు. పచ్చిరొట్ట పంటల విత్తనాలను సైతం పూర్తిస్థాయిలో తిరిగి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పెసలు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు ఉత్పత్తిలో 30 శాతం వరకు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మొక్కజొన్నకు అవసరమైన కొనుగోలు మద్దతు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. మొక్కజొన్న ధరలు గుడ్లు, చికెన్, పాల ధరలపై ప్రభావం చూపుతున్నందున మార్కెట్‌లో తగిన జోక్యం చేసుకోవాలని నిర్ణయించామన్నారు. జొన్నలు, రాగులను ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చి, కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరనున్నట్లు వివరించారు. కందుల సాగు కాలం ముగిసిన నేపథ్యంలో ధరల స్థిరీకరణ నిధి బఫర్ నిల్వల నుంచి రాష్ట్రానికి లక్ష మెట్రిక్ టన్నుల కందులను కేటాయించాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉల్లిపాయలకు కనీస మద్దతు ధర లేనందున రాష్ట్ర ధరల స్థిరీకరణ నిధి ద్వారా కొనుగోలు చేసి, అదే సమయంలో మార్కెట్‌లో విక్రయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. సాంప్రదాయేతర ప్రాంతాల్లోనూ ఉల్లిపాయల సాగును విస్తరించి, రాష్ట్ర వినియోగ అవసరాలకు సరిపడా ఉత్పత్తిని సాధించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా మహారాష్ట్ర నుంచి సరఫరాపై ఆధారపడటాన్ని దశలవారీగా తగ్గించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులతో వంటనూనెల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పొద్దుతిరుగుడు, వేరుశనగ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని నిర్ణయించినట్లు వివరించారు. రైతులకు ధరల మద్దతు కల్పించే కొనుగోలు కార్యక్రమాలకు మొత్తం రూ.2,216.48 కోట్ల ఆర్థిక మద్దతు అవసరమవుతుందని అంచనా వేసినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందులో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు రూ.1,979 కోట్ల ప్రభుత్వ హామీ, కొనుగోలు కార్యకలాపాల నిర్వహణకు రూ.237.48 కోట్ల వ్యయం ఉన్నట్లు వివరించారు. విత్తనాల సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకు పెండింగ్‌లో ఉన్న రూ.184 కోట్లతోపాటు అదనంగా ఆమోదించిన రూ.94 కోట్లు కలిపి మొత్తం రూ.278 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. పంటలను కాపాడేందుకు అవసరమైన రక్షక తడులు అందించడానికి రూ.190 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యాచరణ అమలుకు అవసరమైన నిధులను విడుదల చేయడంతోపాటు వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# కష్టకాలంలో రైతన్న వెన్నంటి ఉంటాం : మంత్రి దుర్గేష్

○ నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ విస్తృత పర్యటన

○ నీట మునిగిన 926 ఎకరాల పంట పొలాల పరిశీలన

○ ఎర్రకాలువ ఉధృతి పరిశీలించి అధికారులు, రైతాంగంతో మాట్లాడిన మంత్రి దుర్గేష్

○ ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్న మంత్రి దుర్గేష్



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** భారీ వర్షాల ధాటికి నిడదవోలు నియోజకవర్గంలో దెబ్బతిన్న పంట పొలాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందల దుర్గేష్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. నియోజకవర్గం నిడదవోలు రూరల్ మండల పరిధిలోని తీరుగూడెం, ఆంజనేయపురం, కంసాలిపాలెం, రావిమెట్ల, శంకరాపురం, తిమ్మరాజుపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురైన సుమారు 370 హెక్టార్లు (926 ఎకరాలు) పంట పొలాలను పరిశీలించారు. ఈ సంక్షిష్ట సమయంలో రైతులకు ధైర్యం కల్పించేందుకు నేరుగా పొలాల్లోకి, రైతుల వద్దకే వెళ్లిన మంత్రి దుర్గేష్.. వారి సమస్యలను సానుభూతితో ఆలకించారు. ఏయే ప్రాంతాల్లో ఎంత మేర పంట నష్టం వాటిల్లిందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా "అన్నదాతలు ఎవరూ దిగులు చెందవద్దు.. ప్రభుత్వం ఎప్పుడూ మీకు అండగా ఉంటుంది" అని మంత్రి దుర్గేష్ రైతులకు భరోసానిచ్చారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో ముంపు సమస్య తలెత్తినప్పుడు కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిహారం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే నినాదంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు.

పర్యటనలో భాగంగా కంసాలిపాలెం–మాధవరం వద్ద ఆగి ఎర్రకాలువ ఉధృతిని పరిశీలించారు. పంట నష్టం అంచనా నివేదికలను ప్రభుత్వానికి పంపేటప్పుడు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని, ముంపునకు గురైన ప్రతి ఒక్క రైతుకూ న్యాయం జరిగేలా ప్రతి హెక్టారు నష్టపరిహారాన్ని అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎర్రకాలువ కారణంగా తరచూ ముంపునకు గురవుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రతి కేబినెట్ సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, శాశ్వత నివారణ చర్యలపై ముమ్మరంగా కృషి చేస్తున్నామని వెల్లడించారు.

అధికారులు అందించిన వివరాల ప్రకారం.. తిమ్మరాజుపాలెంలో 20 హెక్టార్లు, కోరుమామిడిలో 34, కంసాలిపాలెంలో 100, రావిమెట్లలో 76, సింగవరంలో 36, తాళ్లపాలెంలో 32, నిడదవోలులో 72 హెక్టార్లు చొప్పున మొత్తం 370 హెక్టార్లలో సుమారు 530 మంది రైతులు నష్టపోయినట్లు అధికారులు మంత్రి దుర్గేష్ కి వివరించారు. భారీ వర్షాలు పడుతున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దుర్గేష్ వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించి వాహనదారుల ప్రయాణానికి మార్గం సుగమం చేశారు.

# ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ లో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్-2పై కార్పొరేట్ శిక్షణ ముగింపు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో మూడో సంవత్సరం సీఎస్ఈ విద్యార్థుల కోసం నిర్వహించిన ఏడు రోజుల కార్పొరేట్ శిక్షణ కార్యక్రమం 'ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్--2' విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో విద్యార్థులకు ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాక్టికల్ నైపుణ్యాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక అంశాలపై శిక్షణ అందించారు. తరగతి గది బోధనకు తోడుగా ప్రాక్టికల్ అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు సిద్ధం చేయడమే కార్యక్రమం లక్ష్యంగా నిర్వహించారు.

శిక్షణలో ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది విద్యార్థులకు ట్యూషన్స్ ఫర్ యూ సంస్థ పేరిడ్ ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించింది. ఈ అవకాశాలు విద్యార్థులకు వాస్తవిక ప్రాజెక్టులు, పరిశ్రమ వాతావరణం, సాంకేతిక నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్న్‌షిప్ అవకాశాలు పొందిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.

కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక రంగంలో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. విద్యార్థులు మారుతున్న సాంకేతికతలకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

ప్రిన్సిపాల్ డా. దోలా సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యం, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పరిశ్రమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి డా. జి. రాజేష్ చంద్ర మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కార్పొరేట్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌పై అందించిన శిక్షణ విద్యార్థులకు భవిష్యత్ ఉద్యోగ అవకాశాల్లో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పేరిడ్ ఇంటర్న్‌షిప్ అవకాశాలు పొందిన ఎనిమిది మంది విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగం అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ అందించే కార్యక్రమాలను కొనసాగిస్తామని విభాగాధిపతి తెలిపారు.

# భారతీయ విలువలు, సంస్కృతి ఆధారంగా దేశ నిర్మాణం జరగాలి

○ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవవాదం నేటికీ ప్రాసంగికం

○ బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవవాదం భారతీయ జీవన విధానం, సంస్కృతి, విలువల ఆధారంగా దేశ నిర్మాణానికి మార్గదర్శకమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్ అన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా విజయవాడలో నిర్వహించిన 'ఇజం నీ పయనం ఎటు?' కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా ప్రసంగించారు. భారతీయ విలువల ఆధారంగా రాజకీయ ఉద్యమాన్ని నిర్మించాలనే లక్ష్యంతో 1951లో జనసంఘ్ ఏర్పడిందని, 1980లో బీజేపీగా కొనసాగిన ఈ ఉద్యమానికి దీన్‌దయాళ్ ఆలోచనలు కీలక పునాదిగా నిలిచాయని తెలిపారు. భారతీయ సమాజం, సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా దేశ రాజకీయ వ్యవస్థ పనిచేయాలన్నదే ఏకాత్మ మానవవాదం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఎన్నికల వ్యవస్థపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని రామ్ మాధవ్ అన్నారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఫలితాలను అంగీకరించి, ఓడినప్పుడు ఎన్నికల ప్రక్రియను తప్పుబట్టడం సరైన విధానం కాదన్నారు. ఎన్నికల జాబితా పరిశీలనలో సాంకేతిక ప్రక్రియ ద్వారా వెలువడే సమాచారంపై అపోహలు సృష్టించవద్దని సూచించారు. రాజకీయ కార్యకర్తలు పదవి, పేరు, ప్రతిష్ఠ కోసం కాకుండా ప్రజాసేవ, సమర్పణ భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ భావనకు అనుగుణంగా సమాజంలోని చివరి వ్యక్తికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేయాలని సూచించారు.

**దీన్‌దయాళ్ ఆలోచనలు భారతీయ తాత్విక చింతనకు ప్రతిరూపం: పీవీఎన్ మాధవ్**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ భారత రాజకీయాల్లో సిద్ధాంతపూర్వక రాజకీయాలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రత్యేక పునాది వేశారని అన్నారు. 1965 జనవరి 23, 24 తేదీల్లో విజయవాడలో ఆయన ప్రవచించిన ఏకాత్మ మానవవాదం భారతీయ తాత్విక చింతన నుంచి ఉద్భవించిన సమగ్ర జీవన దర్శనమని తెలిపారు. జనసంఘ్ నుంచి బీజేపీ వరకు ఆయన ఆలోచనలు కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని 'సేవా సంకల్ప్ అభియాన్' ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. సిద్ధాంతాలను కేవలం మాట్లాడటం కాకుండా వాటిని ఆచరణలో చూపించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా పుస్తక రచయిత, సంపాదకుడు దుగ్గరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ 'జాతీయ భావం లేని కమ్యూనిస్టులు' పుస్తక రచనకు దారితీసిన పరిస్థితులను వివరించారు. అత్యవసర పరిస్థితి సమయంలో తన విద్యార్థి దశలో ఎదురైన అనుభవాలతో పాటు కమ్యూనిస్టు సిద్ధాంతంపై తాను చేసిన అధ్యయనాన్ని ప్రస్తావించారు. జాతీయ భావన, భారతీయత, రాజకీయ సిద్ధాంతాలపై పుస్తకంలో పలు అంశాలను చర్చించినట్లు తెలిపారు. పుస్తక సమీక్షకుడు పార్థసారథి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467